క్లుప్తంగా

పేదలకు దుప్పట్ల పంపిణీ


మహిళలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ వెంకటరత్నం

మక్కువ: మండలంలోని వెంకటభైరిపురం గ్రామంలో వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని ఎంఎస్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు మరడ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 300 మంది పేద మహిళలకు మంగళవారం దుప్పట్లు పంపిణీ చేశారు. సర్పంచ్ మరడ వెంకటరత్నం చేతుల మీదుగా పేద మహిళలను గుర్తించి దుప్పట్లతో పాటు గ్రామస్తులు, గ్రామ పెద్దల సహాయ సహకారాలతో అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మరడ నారాయణరావు, గురుస్వామి, తీల్ల రామకృష్ణ ఎంఎస్ఆర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

గణనాథునికి లక్షపత్రి పూజ


వినాయకునికి లక్షపత్రి పూజ చేస్తున్న దృశ్యం

పార్వతీపురంటౌన్: వినాయక నవరాత్రులను పురస్కరించుకుని పట్టణంలోని వాసవి కన్యకాపరమేశ్వరి వీధిలో గల కన్యకాపరమేశ్వరి దేవాలయంలో ఆర్యవైశ్య సంఘం, వాసవి మహిళాసంఘం ఆధ్వర్యంలో నెలకొల్పిన వినాయకుడికి మంగళవారం లక్ష పత్రి పూజ నిర్వహించారు. పార్వతీపురం ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని, సమాజ శ్రేయస్సుకోసం పూజలు చేశారు. కార్యక్రమంలో పార్వతీపురం మున్సిపల్ వైస్‌చైర్మన్ యిండుపూరు గున్నేశ్వరరావు, ఉషాఫౌండేషన్ చైర్‌పర్సన్ ఐ.ఉషారాణి, కొత్తా నాగేశ్వరరావు, పూసర్ల చిన్ని కృష్ణ, కందుకూరి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాలతో కూడిన విద్యనభ్యసించాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న చైర్‌పర్సన్ ఈశ్వరమ్మ

సాలూరు: విద్యార్థులు లక్ష్యాలతో కూడిన విద్యను అభ్యసించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మున్సిపాలిటీ, స్థానిక పాఠశాల సంయుక్తంగా విద్యార్థులకు సోమవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థిలకు మంగళవారం ఆమె బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జయరాం, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం


వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యాధికారులు, ఎంపీపీ ప్రమీల

పాచిపెంట: స్థానిక పీహెచ్‌సీలో విశాఖపట్నం మహాత్మా గాంధీ క్యాన్సర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 100 మంది మహిళలకు రొమ్ము క్యాన్సర్, గర్భాశయంలో వచ్చే క్యాన్సర్‌కు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించారు. క్యాన్సర్ లక్షణాలను ఐదుగురిలో గుర్తించామని, వీరికి మెరుగైన వైద్య పరీక్షలు నిర్వహించి క్యాన్సర్ నిర్ధారణ అయితే ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్యం అందిస్తామని ఆస్పత్రి సూపరింటిండెంట్ సుభద్ర తెలిపారు. కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారులు జి.వెంకటరమణ రవిచంద్ర, ఎంపీపీ బద్నాన ప్రమీల, స్ఫూర్తి మహిళా మండల అధ్యక్షురాలు బలగ రాధ తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీకి మారుపేరు రాజన్నదొర : ఎంపీపీ

పాచిపెంట: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర నిజాయితీకి మారుపేరు అని ఆయనపై తప్పుడు ఆరోపణలు చేస్తే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని ఎంపీపీ బద్నాన ప్రమీల అన్నారు. తన కార్యాలయంలో విలేకరులతో ఆమె మంగళవారం మాట్లాడారు. టీడీపీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు దారునాయక్ తన ఇష్టం వచ్చినట్టు లేనిపోని ఆరోపణలు ఉప ముఖ్యమంత్రి రాజన్నదొరపై చేయడం సరికాదన్నారు. చంద్రబాబు మెప్పు కోసం దారునాయక్ తన పరిధి దాటి మాట్లాడుతున్నారని అన్నారు. తప్పుడు ఆరోపణలు మానుకోవాలని సూచించారు.

అందుబాటులో సర్కారు సేవలు

- పరిపాలనలో కొత్తబాట
- సేవలన్నీ ఒకేచోట లభ్యం
- సంతృప్తి వ్యక్తం చేస్తున్న ప్రజలు


వంతరాం గ్రామంలో ప్రజలకు అందుబాటులో సచివాలయం

పార్వతీపురంటౌన్: పట్టాదారు పాస్‌పుస్తకాలు..కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు..రేషన్ కార్డులు..రిజిస్ట్రేషన్లు..వివాహ ధ్రువీకరణ పత్రాలు.. లైసెన్స్‌లు..విద్యుత్ మీటర్లు..పింఛన్ల మంజూరు.. ఇలా పథకం ఏది కావాలన్నా గతంలో ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేది. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఆయా సర్టిఫికెట్ల కోసం వ్యయప్రయాసలు పడాల్సి వచ్చేది. జనం ఇబ్బందులను గమనించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పరిపాలన వ్యవస్థలో సరికొత్త విప్లవానికి శ్రీకారం చుట్టారు. ప్రజల ముంగిటకే సేవలు అందించాలన్న లక్ష్యంతో పై సేవలన్నింటినీ ఒక గొడుగుకిందకు తీసుకువచ్చారు. అదే సచివాలయం..అదే సర్వం..అనేలా ప్రభుత్వం ఈ వ్యవస్థను ముందుకు తీసుకువచ్చింది. ప్రజల చేత ఎన్నుకున్న ప్రజా ప్రతినిధుల అధికారాలను మించిన అధికారాలు నేడు సచివాలయాలు, వలంటీర్ల సొంతమయ్యాయి.

ప్రజలకు దగ్గరగా సేవలు

ప్రజలకు ప్రభుత్వ సేవలు దగ్గర చేయడం ద్వారా అన్ని ప్రభుత్వ శాఖలకు సమాంతరంగా ఒకే వ్యవస్థలా సచివాలయాలు మారిపోయాయి. ప్రజలకు కావాల్సిన ప్రభుత్వ సేవలన్నీ వారి గ్రామ, వార్డు సచివాలయాల్లోనే సమకూరుతున్నాయి. ఈ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు సచివాలయ భవన నిర్మాణాలను ప్రభుత్వం వేగవంతం చేసింది.


ములగ సచివాలయం

సచివాలయ భవన నిర్మాణాలు ఇలా..

పార్వతీపురం మండలంలో 17 భవన నిర్మాణాలు చేపట్టగా అందులో 9 పూర్తిచేసి ప్రజలకు అందుబాటులో ఉంచారు. మరో 8 భవన నిర్మాణాలు త్వరలో పూర్తి కానున్నాయి. సీతానగరం మండలంలో 17 భవన నిర్మా ణాలు చేపట్టగా నాలుగు సచివాలయాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. 13 సచివాలయ భవనాలు త్వరలో పూర్తి కానున్నాయి. బలిజిపేట మండలంలో 20 సచివాలయ భవనాలకు గాను 7 భవనాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. మరో 13 సచివాలయ భవనాలు నిర్మాణదశలో ఉన్నాయి. వాటిని త్వరలో నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నారు.

సేవలు భేష్..

పార్వతీపురం నియోజకవర్గం పరిధిలో ఒక మున్సిపాల్టీ, మూడు మండలాలు ఉన్నాయి. వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ పథకాలు, మెరుగైన ప్రభుత్వ సేవలు సచివాలయల్లో అందుతుండడంతో ప్రభుత్వానికి రుణపడి ఉంటామని ప్రజలు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.


బలిజిపేట మండలంలోని చిలకలపల్లి గ్రామంలో నిర్మాణం పూర్తయిన సచివాలయం




పార్వతీపురం మండలంలోని పెదబొండపల్లి సచివాలయం


అరసాడలో నిర్మాణం పూర్తయిన సచివాలయం



సంగంవలస సచివాలయం


పుట్టూరు సచివాలయం

శిక్షణ ఎంతో ఉపయోగం


ఉపాధ్యాయులకు సూచనలు ఇస్తున్న ఎంఈఓ సామల

బలిజిపేట: పాఠశాలల్లో విద్యాప్రమాణాలు పెంచేందుకు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు ఎంతో ఉపయోగపడతాయని ఎంఈఓ-1 సామల సింహాచలం తెలిపారు. ఈ మేరకు మండలంలోని వంతరాం ఉన్నత పాఠశాలలో వంతరాం, నారన్నాయుడువలస పాఠశాలల కాంప్లెక్స్ పరిధిలో ఉండే సగం మంది ఉపాధ్యాయులకు మంగళవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు పాఠ్యాంశాలు ఏవిధంగా బోధించాలో శిక్షణద్వారా తెలుసుకుని బోధించడం మంచిదన్నారు. మంచి, మంచి అంశాలను చర్చించి ఉపాధ్యాయులకు ఉండే అనుమానాలను నివృత్తి చేసుకోవడానికి ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రాథమికస్థాయిలో విద్యార్థులకు రాయడం, చదవడం నేర్పించడం ఎంతో అవవసరమని చెప్పారు. రానున్న రోజుల్లో డిజిటల్ పాఠాల ప్రాధాన్యం పెరుగుతుందని, ఉపాధ్యాయులు అవగాహన కల్పించుకోవాలని సూచించారు. నాడు-నేడు పనులను వేగవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్ చైర్మన్ చిన్ని వెంకటరమణ, సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తప్పుగా మాట్లాడితే శిక్షలు తప్పవు

- గిరిజన ప్రజాప్రతినిధులు


మాట్లాడుతున్న గిరిజన ప్రజాప్రతినిధులు, నాయకులు

సాలూరు: టీడీపీ అధినేత చంద్రబాబు మెప్పు కోసం కనీస విషయ పరిజ్ఞానం లేకుండా ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొరపై తప్పుడు ఆరోపణలు చేసిన టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు దారునాయక్‌కు చట్ట ప్రకారం శిక్షలు తప్పవని మండల గిరిజన ప్రజాప్రతినిధులు ముప్వల ఆదయ్య, పీడిక సుదర్శనదొర, గొర్లె సత్యవతి, తాడంగి కన్నంనాయుడు, నూకయ్య, పెంటయ్య, సువార్తరావు, చోడిపల్లి బీసు అన్నారు. మరిపల్లిలో స్థానిక విలేకరులతో వారు మంగళవారం మాట్లాడారు. గిరిజనాభివృద్ధికి పాటు పడుతున్న రాజన్నదొరపై లేనిపోని ఆరోపణలు చేయడం తగదన్నారు. తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. గతంలో ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్‌గా దారునాయక్ ఏం మేలు చేశారని ప్రశ్నించారు.

29న మున్సిపల్ సర్వసభ్య సమావేశం

పార్వతీపురంటౌన్: ఈనెల 29న పార్వతీపురం పురపాలకసంఘం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి అధ్యక్షతన, ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కౌన్సిల్ సభ్యులంతా ఈ సమావేశానికి హాజరు కావాలని కోరారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేష్టం


గర్భిణులకు సీమంతాలు నిర్వహిస్తున్న ఎంపీపీ ప్రమీల, అంగన్‌వాడీ సిబ్బంది

పాచిపెంట: తల్లిపాలే బిడ్డకు శ్రేష్టమని ఎంపీపీ బద్నాన ప్రమీల అన్నారు. మండలంలోని పద్మాపురం పంచాయతీ బద్నాయికవలస అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం తల్లిపాల మాసోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ బద్నాన ప్రమీల ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన బాధ్యతలు చేపట్టిన నుంచి ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తూ పాలన సాగిస్తున్నారన్నారు. అందులో భాగంగానే గర్భిణులకు, బాలింతలకు, వైఎస్సార్ సంపూర్ణ పోషణ, వైఎస్సార్ సంపూర్ణ ప్లస్ వంటి పౌష్టికాహారాన్ని అందిస్తున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు చేశారు. సీడీపీఓ అనంతలక్ష్మి, స్థానిక సర్పంచ్ బద్నాన వీరయ్య, ఏసీడీపీఓ, సెక్టర్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి సీఎం జగన్ పెద్దపీట



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఈశ్వరమ్మ

సాలూరు: ప్రజారోగ్యానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ తెలిపారు. స్వచ్ఛత హై సేవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బందికి బీపీ, సుగర్ పరీక్షలను చేసారు. ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్యులు డా.సాయికిరణ్, డా.మహిపాల్, డా.హర్షితా ప్రియ తదితరులు వివరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న చైర్‌పర్సన్ మాట్లాడుతూ, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా వ్యాధులకు దూరంగా ఉండవచ్చని అన్నారు. మన ఆరోగ్యం మన చేతుల్లో ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జయరాం, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఫకీర్ రాజు, వైద్యారోగ్య శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అసలైన రైతులకు భూములు అప్పగించడమే రీ సర్వే లక్ష్యం


మరిపివలసలో స్టోన్ ప్లాంటేషన్‌ను పరిశీలిస్తున్న అధికారులు

సీతానగరం: జగనన్న 'భూ' హక్కు, 'భూ రక్ష రీసర్వే కార్యక్రమంలో భాగంగా అసలైన రైతులకు భూములను అప్పగించడమే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన రీ సర్వే ప్రక్రియ ముమ్మరంగా సాగుతోందని మండల సర్వేయర్ శంకరరావు అన్నారు. ఈ మేరకు మంగళవారం మరిపివలస, చిన్నారాయుడుపేట గ్రామాల్లో తహసీల్దార్ ఎన్వీరమణ ఆధ్వర్యంలో రీ సర్వే చేసిన భూముల్లో స్టోన్ ప్లాంటేషన్, సర్వే పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో సెకెండ్ ఫేజ్‌లో 18 గ్రామాల్లో స్టోన్ ప్లాంటేషన్ చేయాల్సి ఉండగా ఇప్పటికి 10 గ్రామాల్లో పూర్తయిందన్నారు. మరో 6 గ్రామాల్లో స్టోన్ ప్లాంటేషన్ జరుగుతోందని, మిగిలిన 2 గ్రామాల్లో స్టోన్ ప్లాంటేషన్ నిర్వహించ డానికి చర్యలు చేపట్టామని తెలియజేశారు.

సోక్‌పిట్లు ఏర్పాటు చేయాలి


జగనన్న లేవుట్‌లో మాట్లాడుతున్న హౌసింగ్ ఏఈ జానకీరాం

సీతానగరం: మండలంలోని జగనన్న కాలనీల్లో గల ఇళ్ల ప్రాంగణాల్లో లబ్ధిదారులు సోక్ పిట్ నిర్మాణం చేపట్టాలని గృహనిర్మాణ శాఖ ఏఈ జనకీరాం కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన పెదభోగిలి, సీతానగరం జగనన్న కాలనీల్లో ఇంజినీరింగ్ సహాయకులు సంతోష్‌కుమార్, ఎన్ఆర్ఈజీఎస్ క్షేత్ర సహాయకులు అప్పలనాయుడు కలిసి లబ్ధిదారులకు సోక్‌పిట్‌ల నిర్మాణంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 20 సచివాలయాల పరిధిలో ప్రభుత్వం అమలు చేసిన జగనన్న లేఅవుట్లలో నిర్మించిన ఇళ్ల లబ్ధిదారులు ఇళ్లలో వాడుకనీరు, వర్షం నీరు నిల్వ ఉండేవిధంగా సోక్ పిట్లు దోహద పడతాయన్నారు. సోక్ పిట్ నిర్మాణం చేసుకునే లబ్ధిదారులకు ప్రభుత్వం రూ.6 వేలు చెల్లించనుందని తెలిపారు. నీరు కొంతసమయం నిల్వ ఉండడంతో భూమిలోకి నేరుగా మళ్లించడానికి వీలవుతుందన్నారు. వృథానీరు ఆరుబయట ఉండడంతో దోమలు పెచ్చరిల్లి, ప్రజలను అస్వస్థతకు గురి చేస్తాయని చెప్పారు. ప్రభుత్వం సమకూర్చిన ఆర్థిక సహాయంతో ప్రతి ఇంటిప్రాంగణంలో సోక్ పిట్ ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఈ మేరకు సీతానగరం జగనన్న లే అవుట్‌లో 8 మంది లబ్ధిదారులు సోక్‌పిట్ నిర్మాణం చేస్తామని ముందుకు వచ్చారు.

గ్రామాల్లో కార్యదర్శులు సేవలందించాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్

సీతానగరం: ప్రభుత్వం వివిధ శాఖల ద్వారా గ్రామాల్లో అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా పంచాయతీ కార్యదర్శులు సేవలందించాలని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులలో మేరా మట్టి-మేరా దేశ్, జగనన్న ఆరోగ్య సురక్ష, స్వచ్ఛత కార్యక్రమాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 30 నుంచి అమలుకానున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలకు ముందుగా గ్రామాల్లో వైద్యాధికార సిబ్బంది చేస్తున్న సర్వే పూర్తి చేసేలా వారికి సహకరించాలని కోరారు. అలాగే స్వచ్ఛత హై కార్యక్రమంలో భాగంగా కాలువల్లో పూడికలు తీయించి, పారిశుద్ధ్య పనులు చేయించి, తీసిన చెత్తకుప్పలను దూరప్రాంతానికి తరలించాలని సూచించారు. విద్యుద్దీకరణ పనులు చేయించి వీధిలైట్లు వేయాలని, మంచినీరు పథకాలు వాటర్‌ట్యాంక్‌లు, బావుల్లో క్లోరినేషన్ చేయాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందజేయాలని కోరారు.

ఇళ్లలోనే వైద్యపరీక్షలు

- డాక్టర్ రాధాకాంత్


నిడగల్లులో వైద్య సిబ్బంది చేస్తున్న పరీక్షలను పరిశీలిస్తున్న పెదంకలాం పీహెచ్‌సీ డాక్టర్ రాధాకాంత్

సీతానగరం: ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో ఇళ్లలోనే ప్రజలకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నామని మండలంలోని పెదంకలాం పీహెచ్‌సీ డాక్టర్ రాధాకాంత్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన నిడగల్లులో వైద్య సిబ్బంది నిర్వహిస్తున్న 7 రకాల వైద్య పరీక్షలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని అమలు చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. గ్రామాల్లో సచివాలయ ఉద్యోగుల సహకారం తీసుకుని వైద్యసిబ్బంది ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఇంటింటికీ వెళ్లి అవసరమనుకున్న వారందరికీ ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారన్నారు. వైద్య పరీక్షల అనంతరం రోగ నిర్ధారణ చేయనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో నిర్వహించిన సర్వే రిపోర్టుల ఆధారంగా నిపుణులైన డాక్టర్లు, పీహెచ్‌సీ డాక్టర్ల బృందం ఈ నెల 30 నుంచి రోగ నిర్ధారణ చేసి అవసరమైన వైద్యసేవలు అందిస్తారని తెలిపారు. ఈ క్రమంలో 30న బూర్జలో డాక్టర్ల బృందం జగనన్నఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ప్రారంభం కానున్నందున ఇప్పటికే బూర్జలో వైద్య పరీక్షల నిర్వహణ పూర్తి కావచ్చిందని తాజాగా నిడగల్లులో ఇంటింటా వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలకు సేవలందించడానికి ఇంటింటికి వస్తున్న వైద్య సిబ్బందికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓలు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

రూ.19.78కోట్ల ఖర్చుపై సామాజిక తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న ఆడిట్ బృందం

బలిజిపేట: ఉపాధిహామీ పథకంలో భాగంగా 2022-23 ఆర్థిక సంవత్సరంలో నిర్వహించిన వివిధ రకాల పనులకు సంబంధించిన సామాజిక తనిఖీ ప్రజావేదికను బలిజిపేట ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో మంగళవారం నిర్వహించారు. ఎంపీడీఓ విజయలక్ష్మి అధ్యక్షతన సోషల్ ఆడిట్ పబ్లిక్ హియరింగ్ జరిగింది. ఈ సందర్భంగా మండలంలోని 24పంచాయతీల్లో 2022-23ఆర్థిక సంవత్సరంలో 17,124పనులకు రూ.19.78కోట్లు ఖర్చు చేసినట్లు గుర్తించారు. ఈ పనులకు సంబంధించి నిర్వహించిన సోషల్ ఆడిట్‌లో ప్రతి పంచాయతీలో ఎవెన్యూ ప్లాంటేషన్, హార్టికల్చర్, ఉపాధిపనులు, పీఆర్ పనులకు సంబంధించి తనిఖీ చేసి 90శాతం వరకు పనులు బాగున్నాయని అధికారులు గుర్తించారు. జాబ్‌కార్డులు అప్‌డేట్ చేయాలని, మస్టర్లలో దిద్దుబాట్లు ఉండకూడదని సూచించారు. మొక్కల పెంపకంపై దృష్టిసారించాలని సిబ్బందిని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, పీడీ రామచంద్రరావు, జెడ్పీటీసీ రవికుమార్, జగన్, ఎస్ఆర్‌పీలు కె.తిరుపతిరావు, ఎస్.గోవింద్, ఏపీఓ కేశవరావు, సిబ్బంది, పాల్గొన్నారు.

ఈ-క్రాప్ తప్పనిసరి


ఈ క్రాప్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఏఓ అశోక్

పార్వతీపురంటౌన్:

ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండిస్తున్న పంటలకు ఈక్రాప్ నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని వ్యవసాయశాఖాధికారి అశోక్ అన్నారు. ఈ మేరకు మంగళశారం ఆయన మండలంలోని చినమరికి గ్రామంలో పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ క్రాప్ నమోదు వల్ల ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, పథకాలు రైతులకు సమకూరుతాయన్నారు. పంటనష్టం వాటిల్లినా, దిగుబడి అమ్మకాలు చేపట్టేటప్పుడు ఈ విధానం రైతులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. దీనిపై ఆర్‌బీకే సిబ్బంది రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నారని చెప్పారు. రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.